క్లుప్తంగా

సర్వేను సద్వినియోగం చేసుకోండి



రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ సరళ

సి.బెళగల్: జగనన్న శాశ్వత భూ హక్కు – భూ రక్ష పథకంలో భాగంగా చేపడుతున్న రీసర్వేను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ సరళ సూచించారు. గొల్లలదొడ్డి గ్రామ సమీపంలో రెవెన్యూ అధికారులు లింగేష, గ్రామ సర్వే సహాయకురాలు వరలక్ష్మి నిర్వహిస్తున్న సర్వేను ఆమె సోమవారం తనిఖీచేసి, పలు సూచనలు ఇచ్చారు. భూ రికార్డులను పరిశీలించారు. ఆయా గ్రామాల రైతులతో మాట్లాడారు.

గృహ నిర్మాణాలను పూర్తి చేసుకోవాలి

గూడూరు రూరల్: గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని హౌసింగ్ ఏఈ జమ్మన్న సూచించారు. కె.నాగలాపురంలో సోమవారం గృహ నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ పథకం కింద 83 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేశామన్నారు. ఇప్పటి వరకు 12 గృహాలు పూర్తయ్యాయని,మిగతా వారు కూడా త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు.

పంటల నమోదు తప్పనిసరి

సి.బెళగల్: రబీ సీజన్‌లో సాగు చేసుకున్న పంటలను నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ రైతులకు సూచించారు. సోమవారం ఆయన సంగాల, పలుకుదొడ్డి గ్రామాల్లో పర్యటించి వ్యవసాయ సిబ్బంది చేపట్టిన రబీ పంటల నమోదను పరిశీలించి సూచనలు చేశారు. 12వ తేదీలోగా ఈ–కేవైసీని పూర్తి చేసుకోవాలన్నారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ



దివ్యాంగులకు ఫిజియోథెరపీ నిర్వహిస్తున్న వైద్యుడు వీరేష్

సి.బెళగల్: స్థానిక భవితా కేంద్రంలో దివ్యాంగులకు సోమవారం డాక్టర్ వీరేస్ ఫిజియోథెరపీ నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎంఈఓ జ్యోతి పర్యవేక్షించారు. తరచూ ఫిజియోథెరపీ చేయించుకుంటే వైకల్యాన్ని జయించవచ్చని దివ్యాంగుల తల్లిదండ్రులకు ఎంఈఓ సూచించారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీ మద్దిలేటి పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధి ప్రణాళికలు ఇవ్వండి



మాట్లాడుతున్న ఎంఈఓ కోటయ్య

పాణ్యం: పాఠశాలల అభివృద్ధి ప్రణాళికలు ఇవ్వాలని ఎంఈఓ కోటయ్య హెచ్‌ఎంలను కోరారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెచ్‌ఎంల సమావేశంలో ఎంఈఓ మాట్లాడుతూ యాన్యువల్ వర్క్ ప్లాన్ బడ్జెట్ తయారు చేయాలన్నారు. హ్యాబిటేషన్ ప్లాన్, కాంప్లెక్స్ డెవలప్‌మెంట్ ప్లాన్ తదితర వాటికి సంబంధించి పూర్తి వివరాలును అందజేయాలన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూస్తాం

గడివేముల: మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్య లేకుండా చూస్తామని ఎస్‌ఐ బీటీ వెంకటసుబ్బయ్య తెలిపారు. సోమవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన ట్రాఫికర్ కథనానికి ఆయన స్పందించారు. పాత బస్టాండ్ ప్రాంతం నుంచి కొత్త బస్టాండ్ వరకు రద్దీని నియంత్రించేందుకు పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలోని భారీ వాహనాలు రాకుండా చూసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఏపీ టూరిజానికి భూకేటాయింపు

పాణ్యం: మండల పరిధిలోని సుగాలిమెట్ట వద్ద జాతీయ రహదారి పక్కన ఉన్న ఏపీ టూరిజానికి ఐదెకరాల స్థలాన్ని కేటాయించినట్లు తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల పర్యాటక శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపగా వాటిని పరిశీలించి ఐదు ఎకరాల భూమిని మంజూరు చేశామన్నారు. నంద్యాల ఆర్‌డీఓ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు పరిశీలించి కలెక్టర్‌కు ప్రతిపాదించారన్నారు. అలాగే సుగాలిమెట్ట వద్ద చిరుధాన్యాల సాగుకు మరో ఐదెకరాల భూమిని కేటాయించామన్నారు.

ప్రజలు మెచ్చిన నేత జగన్

- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): నవరత్నాల పథకాలు ప్రవేశపెట్టి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రజలు మెచ్చిన నేతగా ఎదిగారని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. ప్రజాసంకల్ప పాదయాత్ర పూర్తై నాలుగేళ్లైన సందర్భాన్ని పురస్కరించుకుని సోమవారం స్టాంటన్‌పురంలోని పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2017 నవంబరు 6న ఇడుపులపాయలో పాదయాత్రను ప్రారంభించి 2019 జనవరి 9న ఇచ్ఛాపురం వద్ద ముగించారన్నారు. ఉమ్మడి 13 జిల్లాల్లోని 134 నియోజకవర్గాల్లో 2,516 గ్రామాల్లో 341 రోజులు 3,648 కిలో మీటర్లు పాదయాత్ర చేసి ప్రజా సమస్యలు తెలుసుకున్నారన్నారు. ఆయన ఇచ్చే భరోసాను నమ్మి ప్రజలు ఓట్లు వేసి గెలించారన్నారు. ప్రజలు నమ్మకాన్ని వమ్ము చేయకుండా ముఖ్యమంత్రి పదవి చేపట్టిన మూడున్నరేళ్లలోనే 98 శాతం హామీలు నెరవేర్చారన్నారు. ఆ ధైర్యంతోనే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రతి ఇంటికి వెళ్తున్నామన్నారు. పాదయాత్ర చేస్తే తనను కూడా ముఖ్యమంత్రి చేస్తారనే అత్యాశతో చంద్రబాబు అనుకున్నారని, అయితే అతని ప్రచార ఆర్భాటానికి పేదలు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారన్నారు. ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా రోడ్లపై సభలు, రోడ్‌షోలు నిషేధిస్తూ ప్రభుత్వం జీఓ ఇవ్వడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో కర్నూలు మండల ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపీపీ2 నెహమ్యా, జెడ్పీటీసీలు ప్రసన్నకుమార్, గిరిజోన్, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు వెంకటేశ్వర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ శేషిరెడ్డి, ఎంపీటీసీ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

– కల్లూరు: ప్రజాసంకల్ప పాదయాత్ర పూర్తై నాలుగేళ్లయిన సందర్భంగా సోమవారం శరీన్‌నగర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి కర్నూలు నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో ప్రజల ఇబ్బందులను కళ్లారా చూశారన్నారు. అప్పుడిచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ప్రజారంజక పాలన సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కాశపోగు జయరాముడు, సంగాల సుదర్శన్‌రెడ్డి, మిద్దె చిట్టెమ్మ, గాజుల శ్వేతా రెడ్డి, సాన శ్రీనివాసులు, దండు లక్ష్మీకాంతరెడ్డి, మైతాపు నరసింహులు, ఎరుకల వెంకటేశ్వర్లు, విక్రమసింహారెడ్డి, ఇప్పల నారాయణరెడ్డి, కల్లూరు జెడ్పీటీసీ ఆల ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

కర్నూలు (న్యూటౌన్): కుల, మతాలకు, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందజేస్తామని కోడూమరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన కర్నూలు మండలం ఈ తాండ్రపాడు గ్రామంలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. మూడున్నరేళ్లలో ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని ప్రజలకు వివరించారు. ఇంటి వద్దకు వచ్చి రేషన్ పంపిణీ చేయడం లేదని టీజీవీ నగర్ వాసులు, మురుగు కాల్వలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఇందిరమ్మ కాలనీ వాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి, ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది వివరాలను డాక్టర్ ముక్తార్‌బాషాను అడిగి తెలుసుకున్నారు. పేదలకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి దీవించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపీపీ2 నెహమ్యా, జెడ్పీటీసీ సభ్యులు ప్రసన్నకుమార్, గిరిజోన్, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు వాసు, దానమ్మ, ఈఓఆర్‌డీ నాగేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మహిళకు సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

పరిహారం అందజేత

కోడుమూరు: లద్దగిరి గ్రామానికి చెందిన ఈటె సువర్ణమ్మ అనారోగ్యంతో కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 8న మృతి చెందింది. వైఎస్సార్ బీమా పథకం కింద ఆ కుటుంబానికి రూ.లక్ష మంజూరైంది. మట్టి ఖర్చుల కోసం సోమవారం బాధిత కుటుంబబ సభ్యులు హరిరాముడికి పంచాయతీ సెక్రటరీ వెంకటేశ్వర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్ జేఎం రామచంద్ర, రూ.పది వేలు అందజేశారు.



పరిహారం అందజేస్తున్న సచివాలయ సిబ్బంది

హమాలీల కూలి పెంచాలి

గూడూరు: సివిల్ సప్లయి హమాలీ కార్మికుల కూలీ రేట్లు పెంచాలని సీఐటీయూ కోడుమూరు డివిజన్ కార్యదర్శి జే.మోహన్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక గోదాము వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంచిన కూలీ రేట్లను ఏడాదైనా అమలు చేయకపోవడం దారుణమన్నారు. కార్మికులను 4 వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, మృతిచెందిన హమాలీల స్థానంలో వారి కుటుంబ సభ్యులకే అనుమతి ఇవ్వాలని, అదనపు గోదాముల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు.



ధర్నా చేస్తున్న హమాలీలు

ధర్నాలో నాయకులు రాజశేఖర్, వెంకటేశ్వర్లు, రంగన్న, సోమలింగడు చిన్న రాజు, మద్దిలేటి, కొమ్ము రాజు, మునెప్ప, దానమన్న, తదితరులు పాల్గొన్నారు.

కూలీల హాజరు పెంచాలి

గూడూరు రూరల్: ఉపాధి పనులకు కూలీల హాజరు పెంచేలా ఫీల్డ్‌అసిస్టెంట్లు దృష్టి సారించాలని ఏపీఓ హసీనా అన్నారు. పెంచికలపాడులో జరుగుతున్న ఉపాధి పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల వ్యాప్తంగా రోజూ 1,000 మందికి పైగా కూలీలు పనులకు వస్తున్నారన్నారు. సంక్రాంతి తరువాత 2,500 మంది కూలీలు వచ్చేలా చూడాలన్నారు.

పొదుపు సంఘాలతోనే సామాజిక అభివృద్ధి

ఓర్వకల్లు: పొదుపు సంఘాలతో మహిళల్లో సామాజిక అభివృద్ధి సాధ్యమవుతుందని ఏపీఎం వెంకటరామిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని నన్నూరు, లొద్దిపల్లె, ఉయ్యాలవాడ గ్రామైక్య సంఘం కార్యాలయాలను ఆయన సందర్శించారు. సెర్ప్ విశ్రాంత సీఈఓ విజయకుమార్ సలహాల మేరకు ఢిల్లీలోని క్రిస్ సంస్థ నుంచి అధ్యయన బృందం ఆయా గ్రామాల పొదుపులక్ష్మి మహిళలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా నన్నూరులో పొదుపు మహిళలు సంఘాల ద్వారా బలపడిన తీరును పరిశీలించారు. అక్కడి నుంచి లొద్దిపల్లెలో పొదుపు మహిళలు సాధించిన ఆర్థిక విజయాలు, సంఘాల పనితీరును పరిశీలించారు. అనంతరం ఉయ్యాలవాడలో పొదుపు మహిళలతో సమావేశం నిర్వహించారు. బాల్య వివాహాలు, పేదరిక నిర్మూలన, సామాజిక అభివృద్ధి, సంఘాల బలోపేతంలో మహిళల పాత్ర తదితర అంశాలపై చర్చించారు. 25 ఏళ్లుగా సంఘాల ద్వారా సాంధించిన ఆర్థిక విజయాలనుపై సంతృప్తి వ్యక్తం చేశారు.

డీఐఓగా ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి(డీఐఓ)గా డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ సోమవారం ఉదయం ఇన్‌చార్జ్ డీఐఓ డాక్టర్ బాలమురళి నుంచి బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహించే అన్ని ఆరోగ్య కార్యక్రమాలు, అభివృద్ధి పథకాలు ప్రజల వద్దకు తీసుకెళ్తానని, గ్రామీణ, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సిబ్బందితో సమన్వయం చేసుకుని పనిచేస్తానని చెప్పారు. ఉన్నతాధికారులైన జిల్లా కలెక్టర్, డీఎంహెచ్‌ఓలు తనకు అప్పజెప్పే బాధ్యతలను తు.చ తప్పకుండా అమలు చేస్తానని తెలిపారు. ఆయనను కార్యాలయ ఉద్యోగులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

లైసెన్స్‌డ్ ఇంజినీర్స్ కార్యాలయం ప్రారంభం

కర్నూలు (టౌన్): నగరంలోని స్థానిక పాత బస్టాండ్ వద్ద స్కంద షాపింగ్ మాల్‌లో కర్నూలు లైసెన్స్‌డ్ ఇంజినీర్స్ అసోసియేషన్ కార్యాలయం ఏర్పాటు చేశారు. దీనిని సోమవారం ఆ సంఘం చైర్మన్ జాకీర్ హుస్సేన్ ప్రారంభించి మాట్లాడారు. నిబంధనల ప్రకారం భవన నిర్మాణాలకు సంబంధించిన ప్లాన్లను రూపొందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమ ంలో సంఘం వైస్ చైర్మన్ నారాయణ కేశవయ్య, కార్యదర్శి ఇజాజ్, సంయుక్త కార్యదర్శి చిన్ని ప్రసన్న, హమీద్, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

గోదాదేవి ఆలయ సందర్శన

కర్నూలు కల్చరల్: నగర శివారులోని మామిదాలపాడు సమీపంలో వెలసిన గోదా గోకులాన్ని శాసన సభ మాజీ ఉప సభాపతి మండలి బుద్ధ ప్రసాద్, విశ్రాంత ఐఏఎస్, తిరుమల తిరుపతి దేవస్థానముల సంయుక్త కార్యనిర్వహణాధికారి నంది వెలుగు ముక్తేశ్వరరావు సందర్శించారు. శ్రీరంగంలో కొలువై ఉన్న శ్రీరంగనాథుడిని పోలిన ఆలయాన్ని నిర్మించిన తీరును చూసి నిర్వాహకులను అభినందించారు. గోదా గోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజు గుప్త ఆలయం గురించి వారికి వివరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



లవకుశ నాటకంలోని ఓ సన్నివేశం

ఆకట్టుకున్న ‘లవకుశ’

కర్నూలు కల్చరల్: టీజీవీ కళాక్షేత్రంలో సురభి నాటకాల ప్రదర్శన కొనసాగింది. రెండోరోజు సోమవారం కళాకారులు ప్రదర్శించిన లవకుశ నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాన్ని కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య ప్రారంభించి ప్రసంగించారు. కళాకారులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉండి, వారి సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. కళాక్షేత్రంలో చక్కని కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అభినందించారు. పెద్ద ఎత్తున ప్రేక్షకులు తరలి రావడాన్ని చూస్తే పౌరాణిక నాటకాలకు ఆదరణ తగ్గలేదని నిరూపితమవుతుందన్నారు. అనంతరం సురభి కళాకారులతో ప్రదర్శించబడిన లవకుశ నాటకం ఆకట్టుకుంది. శ్రీరామ పట్టాభిషేకం, రాక్షస మాయలు, పక్షుల విహారం, యుద్ధ సన్నివేశం, లవకుశల ఆశ్రమ విద్యాభ్యాసం వంటి ఘట్టాలు అలరించాయి. అనంతరం సురభి శివశంకర్‌ను మేయర్ సన్మానించారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కార్యదర్శి మహమ్మద్ మియ్యా, ఉత్సవాల కన్వీనర్ బాలవెంకటేశ్వర్లు, సమితి ఉపాధ్యక్షుడు ఇనాయతుల్లా, కోశాధికారి లక్ష్మీకాంతరావు, సభ్యులు రాజారత్నం, వాల్మీకి రాముడు, సురభి సరేష్ , యాగంటీశ్వరప్ప, తదితరులు పాల్గొన్నారు.



సురభి కళాకారున్ని సన్మానిస్తున్న మేయర్ రామయ్య

‘స్పందన’ సమస్యలకు సత్వర పరిష్కారం

ఓర్వకల్లు: స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి అన్నారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో పలు సమస్యలపై వినతులు స్వీకరించారు. ప్రధానంగా పొలం కొలతలు, ఆన్‌లైన్ నమోదు, పట్టాదారు పాసుపుస్తకాలు, కుల ధ్రువీకరణ, తదితర సర్టిఫికెట్లకు దరఖాస్తులు, వినతులు సమర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివనాగప్రసాద్, వివిధ శాఖల ఏఈలు రామసుబ్బారెడ్డి, మురళీకృష్ణ, రామయ్య, ఏఓ సుధాకర్, ఏపీఓ కుమార్‌సాయినాథ్, ఆర్‌ఐ రంగస్వామి, ఈఓఆర్‌డీ వెంకటసుబ్బరాయుడు పాల్గొన్నారు.

ప్రతి అర్జీని పరిష్కరించండి

గడివేముల: స్పందన కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీని పరిష్కరించాలని తహసీల్దార్ శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో వచ్చిన వినతులను పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. సచివాలయాలలో ప్రతి వీఆర్వో అందుబాటులో ఉండాలన్నారు.

ఈ-క్రాప్ బుకింగ్ చేసుకోండి



కరిమద్దెలలో ఈ-క్రాప్ బుకింగ్‌ను పరిశీలిస్తున్న ఏఓ

గడివేముల: రబీలో సాగు చేసిన ప్రతి పంటను నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి హేమసుందర్‌రెడ్డి రైతులకు సూచించారు. సోమవారం మండల పరిధిలోని కరిమద్దెల గ్రామ పరిధిలో జరుగుతున్న పంట నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఏఓ హేమసుందర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ-క్రాప్ బుకింగ్ ద్వారా ప్రభుత్వ పథకాలు అందుతాయన్నారు.

భూ రీ సర్వేకు సహకరించాలి

కర్నూలు (న్యూటౌన్): గ్రామాల్లో చేపడుతున్న భూముల రీ సర్వేకు రైతులు సహకరించాలని కర్నూలు రూరల్ ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఐ.వి జయశ్రీ కోరారు. సోమవారం ఆమె మాట్లాడుతూ కర్నూలు మండలంలోని 21 రెవెన్యూ గ్రామాల్లో 28745.87 ఎకరాల్లో భూముల రీ సర్వే పూర్తయిందన్నారు.

శునకాల నియంత్రణకు చర్యలు

కల్లూరు: శునకాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య తెలిపారు. కల్లూరు అర్బన్ పరిధి 19వ వార్డులోని రాజేశ్వరినగర్, గణేష్ నగర్, నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలలో ఉన్న వీధి కుక్కలను సోమవారం మున్సిపల్ సిబ్బంది సంతాన నియంత్రణ కేంద్రానికి తరలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ అవసరమైతే శునకాల నియంత్రణ కేంద్ర సామర్థ్యం పెంచుతామన్నారు.

స్పందన సమస్యలను పరిష్కరించండి



స్పందనలో అర్జీ స్వీకరిస్తున్న అధికారులు

సి.బెళగల్: ప్రజలు ఇచ్చిన అర్జీలను పరిశీలించి ఇప్పటికప్పుడే సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ శివశంకర్‌నాయక్ అధికారులకు సూచించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. పొలం గట్లు, భూ సమస్యలను, ఇళ్ల పట్టాలు, పింఛన్ పునరుద్ధరణ సమస్యపై ఎక్కువగా అర్జీలు అందాయి. అనంతరం ఎంపీడీఓ రాముడుతో కలిసి అధికారులతో తహసీల్దార్ సమావేశమై సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. స్పందనలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్, ఈఓఆర్డీ సందీప్, ఏఓ మల్లేష్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, హౌసింగ్ ఏఈ సుమంత్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్రభుత్వం అండ

కోడుమూరు: దివ్యాంగులకు ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అందజేస్తూ అండగా నిలుస్తోందని కోడుమూరు మండల విద్యాధికారి అనంతయ్య యాదవ్ తెలిపారు. సోమవారం దివ్యాంగ విద్యార్థులు జగన్ మోహన్, వేణులకు వినికిడి యంత్రాలు, వైష్ణవి, సింధులకు ట్రైసైకిల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వం పథకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మన్న, ఉపాధ్యాయులు ప్రసాద్, సీతారామయ్య, ఆదినారాయణ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు ట్రై సైకిళ్లను అందజేస్తున్న ఎంఈఓ అనంతయ్య

పీఈటీలు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

కర్నూలు (టౌన్) : మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యా రంగంలో వస్తున్న సాంకేతికతను వ్యాయామ ఉపాధ్యాయులు అందిపుచ్చుకుని విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పాటు పడాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ రంగారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మాంటిస్సోరి పాఠశాలలో ఖేలో ఇండియా, ఫిట్ ఇండియా యాప్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ పాఠశాల విద్యలో వ్యాయామ విద్యను ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్యార్థుల మానసిక, శారీరక ధృఢత్వాన్ని ఖేలో ఇండియా ,ఫిట్ ఇండియా యాప్స్‌లో నమోదు చేసేందుకు సాంకేతికతను నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మయ్య, జిల్లా ఉపవిద్యాధికారి హనుమంతరావు, వ్యాయామ విద్య ఉపాధ్యాయుల సంఘం కార్యదర్శి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్‌లో డిగ్రీ కాలేజీ విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కళావతి

కర్నూలు (టౌన్) : డాక్టర్ త్రినాథ్ కిక్ బాక్సింగ్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 8 వ తేదీ నిర్వహించిన జిల్లా స్థాయి కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో కర్నూలు డిగ్రీ కళాశాల (పురుషులు) విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. కళాశాలకు చెందిన బి.ప్రసాద్, తిప్పయ్య, చంద్రశేఖర్ ప్రథమ స్థానంలో విజేతలుగా నిలిచారు. పాయింట్స్ ఫైట్ 63 కేజీల సీనియర్స్ బాలురు విభాగంలో వంశీ (ప్రథమ), హరికళ్యాణి(ద్వితీయ), భరత్ (తృతీయ) స్థానాల్లో నిలిచారు. అలాగే ఈనెల 6 వ తేదీ కర్నూలు స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి శాప్ అథ్లెటిక్స్ లీగ్ టోర్నమెంట్‌లో బీఏ విద్యార్థిని చంద్రప్పగారి దేవి 400 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్‌లో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించింది. సోమవారం పతకాలు సాధించిన విద్యార్థులను కళాశాలలోని తన చాంబర్‌లో ప్రిన్సిపాల్ డాక్టర్ కళావతి అభినందించారు.

అంతర్జాతీయ సదస్సుకు జిల్లా వాసి

కర్నూలు సిటీ: అమెరికాలోని డెన్వర్ రాష్ట్రంలో గల సుప్రసిద్ధ కొలరాడో విశ్వవిద్యాలయంలో ఈనెల 12 నుంచి నిర్వహించే అంతర్జాతీయ సదస్సులో పాల్గొనే అవకాశం జిల్లాకు చెందిన ప్రొఫెసర్‌కు దక్కింది. ఎమ్మిగనూరు మండలం పెసలదిన్నె గ్రామానికి చెందిన ఆచార్య ఇ.వెంకటేశులు హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో రాజనీతి శాస్త్రం ఆచార్యులుగా పనిచేస్తున్నారు. ‘75 ఏళ్ల స్వాతంత్ర్య భారత దేశంలో ప్రభుత్వ విధానాలు’ అనే అంశంపై ఆయన కొలరాడో విశ్వవిద్యాలయంలో తన పరిశోధన పత్రాన్ని సమర్పించి ప్రసంగించనున్నారు. ప్రపంచ వ్యాప్తంగా పేరు ప్రతిష్టలు ఉన్న ప్రొఫెసర్లు హాజరయ్యే సదస్సులో తనకు పాల్గొనే అవకాశం వచ్చిందని ఆయన సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.



ఆచార్య వెంకటేశులు

ఇంటి వద్దకే వైద్యసేవలు

- జిల్లా కలెక్టర్ పి. కోటేశ్వరరావు
- ఉత్తమ సేవలు అందించిన వైద్యులకు ప్రశంసాపత్రాలు

కర్నూలు(హాస్పిటల్):ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రజలకు ఇంటి వద్దే వైద్యసేవలు అందుతున్నాయని జిల్లా కలెక్టర్ పి. కోటేశ్వరరావు చెప్పారు. జిల్లాలో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లో ఉత్తమ సేవలు అందించిన వైద్యులకు సోమవారం కలెక్టరేట్‌లో ఆయన ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత అక్టోబర్ 21వ తేదీ నుంచి ఫ్యామిలీ డాక్టర్ విధానం అమల్లోకి వచ్చిందన్నారు. జిల్లాలో నెలకు రెండు సార్లు 104 వాహనం ద్వారా వైద్యులు గ్రామంలో ఇంటింటికి తిరిగి సాధారణ ఆరోగ్య సమస్యలు, గర్భిణులకు ఆరోగ్యపరీక్షలు, బాలింతలకు, శిశువులకు, రక్తహీనత ఉన్న వారికి, షుగర్ వ్యాధిగ్రస్తులకు, కిడ్నీ సమస్యలున్న వారికి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్యులను మరింత ప్రోత్సహించేందుకు, ఇంకా మెరుగైన వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతి నెలా ఉత్తమ సేవలు అందించిన వైద్యులకు ప్రశంసాపత్రాలు అందించి అభినందిస్తుందన్నారు. ఇదే స్ఫూర్తితో అన్ని శాఖల అధికారులు ప్రజలకు సేవలు అందించాలని పిలుపునిచ్చారు. డిసెంబర్ నెలలో ఉత్తమ సేవలు అందించిన గార్గేయపురం పీహెచ్‌సీ డాక్టర్ హేమలత, హుసేనాపురం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అమరనాథ్‌రెడ్డి, కల్లూరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్. శైలజకుమార్, పోలకల్ పీహెచ్‌సీ వైద్యులు హరిశ్చంద్రుడు, తుగ్గలి పీహెచ్‌సీ వైద్యులు ద్రాక్షాయిని, కమ్మరిచేడు పీహెచ్‌సీ వైద్యులు సుమితలకు ఉత్తమ సేవలు అందించిన వారిగా ఎంపిక చేసి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య, ఫ్యామిలీ ఫిజిషియన్ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ బాలమురళి, డీపీఎంఓలు సుబ్రహ్మణ్యం, ప్రకాష్ పాల్గొన్నారు.



ఉత్తమ వైద్య సేవలు అందించిన వైద్యురాలికి ప్రశంసాపత్రం అందిస్తున్న కలెక్టర్ కోటేశ్వరరావు

అభివృద్ధి పనుల్లో వేగం పెరగాలి

కర్నూలు(సెంట్రల్) : జిల్లాలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనుల్లో వేగం పెరగాలని కలెక్టర్ పి.కోటేశ్వరరావు మండలాధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి వివిధ సంక్షేమ పథకాల అమలుపై అన్ని శాఖల అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా జేసీ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డితో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచి, పూర్తయిన ఇళ్లకు వెంటనే విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా ప్రజాప్రతినిధులు సూచించిన పనులను పకడ్బందీగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, పీఆర్ ఎస్‌ఈ సుబ్రమణ్యం, సీపీఓ అప్పలకొండ, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ ఎన్.మనోజ్‌రెడ్డి పాల్గొన్నారు.